క్లుప్తంగా

ఇండియా వలస పాలకులు పెట్టిన పేరు

పాత గుంటూరు: వలస పాలకులు దేశానికి ఇండియా అని పేరుపెట్టారు గానీ తరతరాలుగా మన దేశం భారతదేశమేనని బీజేపీ జాతీయ కార్యదర్శి వై. సత్యకుమార్ తెలిపారు. శివ శంఖారావం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కేసులో ఐటీ, ఈడీ సంస్థలు వాటి పని అవి చేస్తాయని చెప్పారు. భారత్ జోడో యాత్ర చేసిన రాహుల్ గాంధీ నేడు భారత్‌ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

వేతనాలు అందక ఉపాధ్యాయులు సతమతం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఖజానాధికారి పి. రాజగోపాలరావుకు విజ్ఞప్తి చేసినట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం తాత్సారం చేయడం తగదని, వెంటనే చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

భర్త, అత్త వేధింపులపై కేసు నమోదు

చేబ్రోలు: అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న భర్త, అత్తలపై చేబ్రోలు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చేబ్రోలు యడ్లపాటి నగర్ ప్రాంతానికి చెందిన గేరా ప్రవల్లికను దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన గేరా అశోక్‌కు ఇచ్చి ఏడాదిన్నర క్రితం వివాహం చేశారు. కొంత కాలంగా మద్యానికి బానిసైన అశోక్‌ను భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడు. కొద్ది రోజులుగా అత్త, భర్తలు అదనపు కట్నం తీసుకు రావాలని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారు. దీనిపై ప్రవల్లిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్కా జూదరుల అరెస్టు

పొన్నూరు: పట్టణంలోని చీరాల బస్‌స్టాప్, ఇతర ప్రాంతాలలో మట్కా జూదం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్ఐ బి. రామబ్రహ్మం బుధవారం తెలిపారు. వారి వద్ద రూ. 3,500ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు చెప్పారు.

హకీం జానీకి సన్మానం



తెనాలి అర్బన్: వాసవీ క్లబ్ కింగ్స్ సంస్థ వార్షికోత్సవంలో భాగంగా తెనాలికి చెందిన ప్రముఖ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీం జానీని సన్మానించారు. గంగానమ్మపేటలోని సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో క్లబ్ తెనాలి అధ్యక్షుడు పీవీవీ సత్యనారాయణ, కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు చుండూరు రామమోహనరావు, కూనల సుమన్, ఏ నాగమురళీధరరావు, కుసుమాంబ, లీలారాణి పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న యువకుడి అరెస్టు



ఫిరంగిపురం: అక్రమంగా మద్యం అమ్ముతున్న యువకుడిని బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నుదురుపాడు గ్రామంలోని పోలేరమ్మ గుడివద్ద జి.ప్రశాంత్ కుమార్ అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఎస్ఐ చల్లా కిశోర్ సిబ్బందితో వెళ్లి ప్రశాంత్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 40 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని నరసరావుపేట కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. కోర్టు అతడికి 14 రోజుల రిమాండు విధించినట్లు వివరించారు.

రూ.20లక్షలతో అభివృద్ధి పనులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి ప్రధాన రహదారిలో కొత్తగా తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయడంతో కార్పొరేషన్ అధికారులు సిమెంటు రోడ్డును పగులగొట్టారు. ఆ ప్రాంతంలో రోడ్డు మరమ్మతులు, కొత్త డ్రెయిన్ నిర్మించేందుకు బుధవారం పనులు చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి ప్రధాన రోడ్డులో గతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, రూ.10 లక్షలు కేటాయించి నూతనంగా 600 మీటర్లు పొడవున డ్రైనేజీ నిర్మిస్తున్నామని తెలిపారు. తాడేపల్లి ఒకటో వార్డు నుంచి కృష్ణుడి గుడి వరకు సుమారు వెయ్యి మీటర్ల పొడవున పైపులైన్ల నిమిత్తం పగులగొట్టిన సీసీ రోడ్డును పునర్నిర్మిస్తున్నామని, ఇందుకోసం రూ.10లక్షలు కేటాయించినట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

నందగోపాలా.. నవనీత చోరా..

సందడిగా కృష్ణాష్టమి వేడుకలు

గుంటూరు ఎడ్యుకేషన్: కృష్ణాష్టమి పండుగ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతుందని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ పేర్కొన్నారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో సందడిగా ఉట్టి కొట్టారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాల్ని చాటి చెప్పడం మన బాధ్యతని తెలిపారు. భావితరాలకు మనం ఇచ్చే వారసత్వ సంపద అవే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

● బ్రాడీపేటలోని శ్రీమేధ విద్యాసంస్థల క్యాంపస్‌లో బుధవారం కృష్ణాష్టమి వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని సందడిగా జరిపారు. సంస్థ డైరెక్టర్ అన్నా నందకిశోర్ మాట్లాడుతూ చేయిచేయి కలిపి సమష్టిగా కృషి చేస్తే ఎంతటి కష్టమైన కార్యమైనా సాధించవచ్చునేందుకు కృష్ణాష్టమి పండుగలో ఉట్టికొట్టడం ప్రతీకని వివరించారు. చిన్నతనంలో అల్లరి పనులు చేసిన శ్రీకృష్ణ పరమాత్ముడు పెద్దయిన తరువాత గీతోపదేశం గావించి జగద్గురువు అయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ అన్నా శ్రీలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఎల్‌బీసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాలలో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం వారితో ఉట్టి కొట్టించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాస్, జోనల్ ఇన్‌చార్జ్ అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థినులతో విష్ణువర్ధన్, వరప్రసాదరావు, కృష్ణవేణి, ఉపాధ్యాయిలు



శ్రీమేధ క్యాంపస్ ప్రాంగణంలో ఉట్టి కొడుతున్న నందకిశోర్, పక్కన శ్రీలక్ష్మి



విజ్ఞాన్ స్కూలులో ఉట్టి కొడుతున్న విద్యార్థి

వేడుకల్లో పాల్గొన్న అంబటి రాయుడు

పట్నంబజారు : కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా నగరంలో జరిగిన వేడుకల్లో ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పాల్గొన్నారు. నగరంలోని తూర్పు నియోజకవర్గం, యాదవ బజారులోని గీతా మందిరంలో బుధవారం తలారి రాము, రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో వారు పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి రాచమంటి భాస్కర్, స్థానికులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

గుంటూరు రూరల్: శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వాడవాడలా ప్రత్యేక పూజలను బుధవారం నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు అభిషేకాలు చేశారు. ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని వెంగళాయపాలెం, జొన్నలగడ్డ, గోరంట్ల, గోర్లవారిపాలెం, తోకావారిపాలెం, తదితర గ్రామాల్లో వేడుకలను నిర్వహించి ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

● కృష్ణం వందే జగద్గురుం...



శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో హిందూ ధర్మ సంప్రదాయ చైతన్య మహోత్సవం ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

పాత గుంటూరు: శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా ధర్మో రక్షతి రక్షతః ట్రస్ట్, కల్యాణ ట్రస్ట్, వాసవీ ఇంటర్నేషనల్ పరివార్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో హిందూ ధర్మ సంప్రదాయ చైతన్య మహోత్సవ శివ శంఖారావం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గోపూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శ్రీ శివస్వామి పాల్గొని పూజలు నిర్వహించారు. ఉదయం 108 మంది దంపతులతో సర్ప సూక్త హోమం, చిన్నారులకు శ్రీ కృష్ణుని వేషధారణ, పూర్ణాహుతి, మంత్రపుష్పం, పంచ మాంగల్యాలు, సంప్రదాయ వస్త్ర అలంకరణ ప్రదర్శన, ఉట్టికొట్టే కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. సాయంత్రం రుక్మిణీ శ్రీ కృష్ణుల కల్యాణం భక్తిశ్రద్ధలతో జరిపారు. ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యదర్శి వై. సత్యకుమార్, క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంధి కాంతారావు, తులసి గ్రూపు సంస్థల చైర్మన్ తులసి రామచంద్రప్రభు, బి. కృష్ణంరాజు, వేముల హజరత్తయ్య గుప్తా, దేవరశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.



ఇస్కాన్ టెంపుల్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు

వ్యవసాయంపై యువత ఆసక్తి పెంచుకోవాలి

తెనాలి: రైతు స్థితిని, స్థాయిని పెంచుకుంటూ ఆరోగ్యవంతమైన భారతదేశం ఆవిష్కరణకు అందరం కృషి చేద్దామని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, జాయింట్ ఫర్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వీవీ లక్ష్మీనారాయణ సూచించారు. కొల్లిపర మండల గ్రామం అత్తోటలో ప్రకృతి వ్యవసాయం, దేశీ వరి విత్తన నిధి, గో ఆధారిత ఉత్పత్తుల కేంద్రమైన భూమి భారతి ఆధ్వర్యంలో బుధవారం ప్రకృతి విధానంలో దేశవాళీ వరి నాట్ల పండగను నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలో ముందుగా స్కూలు పిల్లలు సాంస్కృతిక అంశాలను ప్రదర్శించారు. స్కూలు విద్యార్థులు, భూమి భారతి బాధ్యులు, రైతులతో కలిసి వీవీ లక్ష్మీనారాయణ, అక్కడి పంటచేలో దేశవాళీ రకమైన కాలాబట్టీ వరి నాట్లను వేశారు. దీనికి ముందు ఉట్టి కొట్టే వేడుకను జరిపారు. నేటి తరానికి వ్యవసాయాన్ని పరిచయం చేసేందుకు భూమి భారతి నిర్వాహకులు దేశవాళీ వరినాట్ల పండగను చేపట్టడాన్ని వీవీ లక్ష్మీనారాయణ అభినందించారు. తానా సహకారంతో నడుస్తున్న భూమి భారతికి తమవంతుగా మిల్లింగ్ మిషన్ సమకూర్చినట్టు గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతకాలంలో వ్యవసాయంలోకి యువతరం రావటం లేదని, పిల్లలకు ఇప్పట్నుంచే వ్యవసాయం, రైతుల గురించి ఆసక్తిని కలుగచేస్తే భవిష్యత్‌లోనైనా యువతీయువకులు సేద్యంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో వ్యవసాయం పరిస్థితిని ముందే ఊహించి, నేటితరానికి పరిచయం చేస్తున్న భూమి భారతి వ్యవస్థాపకులు యర్రు బాపారావు, అమర్ అక్బర్‌లను దార్శనికులుగా లక్ష్మీనారాయణ అభినందించారు. రాబోయే ఏడాది నుంచి ప్రతిచోట ఈ పండగను నిర్వహించాలని తీర్మానించారు. దేశవాళీ వరి విత్తన సంపదను మనం కాపాడుకోవాలని చెప్పారు. దేశంలో వీవీఐపీ ఎవరైనా ఉంటే అది రైతేనని లక్ష్మీనారాయణ చెప్పారు. టోల్‌గేట్‌ల వద్ద ఏర్పాటుచేసే టోల్‌గేట్ మినహాయింపుదార్ల పేర్లలో మొదట రైతు పేరును చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల్లో ఆగస్టు 15, జనవరి 26న జరిగే జెండా ఆవిష్కరణలను రైతులచే చేయించాలని అభ్యర్థించారు. వేడుకలో అత్తోట రైతులు నామని రోశయ్య, వరికూటి రామకృష్ణ, యర్రు రవీంద్రబాబు, యర్రు సత్యనారాయణ, చందు సాంబయ్య, యర్రు రామకృష్ణ, గనిపిశెట్టి శ్రీనివాస్, గంటా కనకయ్య, దైవాల శ్రీనివాస్, యర్రు శ్రీనివాస్, గంటా మహేష్, పరిశోధక విద్యార్థిని ఉష, కేఎల్ యూనివర్సిటీ టెక్నాలజీ ఇంకుబేటర్స్ ఫౌండేషన్, ఏసీఐసీ విభాగాల సీఈవోలు గోవిల్ అలోక్, వి.రమణీకాంత్, అత్తోటలోని కేరళ మోడల్ స్కూల్, పెదవడ్లపూడి నాగార్జున పబ్లిక్ స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. భూమి భారతి బాధ్యులు యర్రు బాపారావు, అమర్ అక్బర్ పర్యవేక్షించారు.



వరి నాట్లలో వీవీ లక్ష్మీనారాయణ, రైతులు, కేఎల్ యూనివర్సిటీ బృందం

అడ్వాన్స్ తీసుకుని మొహం చాటేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: చికెన్ షాపులో పని చేసేందుకు అడ్వాన్స్ తీసుకుని ఓ వ్యక్తి యజమానిని మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేటకు చెందిన షేక్ సాబిల్ వికలాంగుల కాలనీలోని శివమ్మ చికెన్ షాపులో పని చేసేందుకు ఒప్పుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ. 1,50,000 తీసుకుని మొహం చాటేశాడు. సెల్ కూడా స్విచ్ఛాఫ్ చేశాడు. మోసపోయినట్లు నిర్ధారించుకున్న శివమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆపదలో ఉన్న బాధితులకు అభయహస్తం సీఎం సాయం

తాడికొండ: ఆపదలో ఉన్న బాధితులకు అభయం సీఎం రిలీఫ్ ఫండ్ అని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. తాడికొండ నియోజకవర్గంలో వివిధ కారణాలతో ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్న బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమంతో ప్రతి పేదవాడికీ మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యవసర సమయాల్లో ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధి పొందలేని బాధితుల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా వేలాది కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా తాడికొండకు చెందిన అవుతు పరమేశ్వరి, యాసం వెంకటేశ్వరి, కంతేరుకు చెందిన అన్నపురెడ్డి శివలింగారెడ్డి, మందడం గ్రామానికి చెందిన ఆలూరి సామ్రాజ్యంలకు రూ.3.35 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

అధికారులకు ఎమ్మెల్యే ముస్తఫా ఆదేశం

పట్నంబజారు: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని 14, 15, 17 డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో సైడు కాల్వలు, డ్రెయినేజీ లీకులు, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో పారిశుద్ధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా ఉండాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని సిబ్బందికి సూచించారు. సైడు కాల్వలు, డ్రెయినేజీల మరమ్మతులు వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతోందని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేసి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామనబోయిన విజయ్‌యాదవ్, ఫర్హానా, వేముల జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు బిఖారి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని రెండో డివిజన్ ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి కుటుంబంలో ప్రత్యేక రోజును పురస్కరించుకుని మొక్కలు నాటాలని సూచించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మర్రి అంజలి, వైఎస్సార్ సీపీ నేతలు సత్యనారాయణ, నాగేంద్రరెడ్డి, మల్లేశ్వరరావు, బోసు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో క్రికెటర్ అంబటి రాయుడు సందడి

● స్థానికులతో మాటామంతి
● రైతులతో ముఖాముఖి

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డ గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ముందుగా మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ చెరువు వద్ద మొక్కలు నాటారు. గ్రామంలోని విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, సచివాలయాన్ని సందర్శించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదో తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని రైతుల ముఖాముఖిలో పాల్గొన్నారు. సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. వాటికి ఏ విధంగా పరిష్కారం చూపాలో వారితో చర్చించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగించుకోవాలని అంబటి రాయుడు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని, మంచి భవిష్యత్‌ను పొందాలని సూచించారు. గ్రామ పెద్దలతో పలు విషయాలపై చర్చించారు. గ్రామంలోని పలువురి ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష,పార్టీ గ్రామ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, వంగా నవీన్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఎదురుపాక వెంకట్, మబ్బు సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు

త్వరలో అందుబాటులోకి మరో 50 వెంటిలేటర్లు

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలందిస్తున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం ఆసుపత్రిలో ఐసీయూలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నిత్యం రోగులకు వైద్య సేవలు అందించడానికి వీలుగా మరో 50 వెంటిలేటర్లు అందుబాటులోకి తీసుకొస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం ఐసీయూలో 35 పడకలతో మాత్రమే వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఐసీయూలో 24 గంటలూ రోగులకు సేవలందించేందుకు అదనంగా సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. అత్యవసర వైద్య సేవల విభాగంలో ప్రత్యేకంగా తొమ్మిది మంది సీనియర్ రెసిడెంట్లను ప్రభుత్వం నియమించిందని చెప్పారు. జీజీహెచ్‌లో పీజీ వైద్యుల పాత్ర ఎంతో కీలకమని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు జూనియర్ వైద్యులు ఊపిరి పోస్తున్నారని తెలిపారు. ఐసీయూ వార్డులో సమస్యల్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తక్షణమే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తనిఖీల్లో సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, అసిస్టెంట్ ఆర్ఎంవో యనమల రమేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ, రాజ్యలక్ష్మి ఉన్నారు.



ఐసీయూలో రోగులను పరామర్శిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు మహంకాళి అమ్మవారి దేవస్థానం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరుకు నలుగురు యువకులు గూడ్స్ ఆటోలో వాటర్ క్యాన్లు తరలిస్తున్నారు. ఈ సమయంలో ఆటోడ్రైవర్ రామకృష్ణతో పాటు డి.వెంకటేశ్వర్లు, అల్లూరి ఏసుబాబుతో పాటు మరో యువకుడు ప్రయాణిస్తున్నారు. కంఠంరాజు కొండూరు మహంకాళి అమ్మవారి దేవస్థానం వద్ద ఉన్న మలుపులో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏసుబాబు (20) అక్కడికక్కడే మృతి చెందగా, వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కాగా డ్రైవర్ రామకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. మృతి చెందిన ఏసుబాబుకు తండ్రి చనిపోవడంతో కుటుంబ భారాన్ని ఇతనే తీసుకుని తల్లిని పోషించుకుంటున్నాడు. ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లి శోకసంద్రంలో మునిగింది. రోడ్డు ప్రమాద సమాచారాన్ని అందుకున్న దుగ్గిరాల పోలీసులు హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకుని ఏసుబాబు మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.



మృతి చెందిన కంఠరాజు కొండూరుకు చెందిన అల్లూరి ఏసుబాబు

'చంద్రబాబు అవినీతి బాగోతం బట్టబయలు '

తాడికొండ: రాజధాని పేరుతో చంద్రబాబు చేసిన అవినీతి బాగోతం బట్టబయలైందని, అవినీతి కేసుల్లో ఇక జైలుకెళ్లడం ఖాయమని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోగస్ కంపెనీలను సృష్టించి, వాటి ద్వారా రూ.118.96 కోట్లు లంచం రూపంలో తీసుకున్న చంద్రబాబు కోడ్ భాషద్వారా చేసిన అవినీతిపై ఐటీ శాఖ లోతుగా దర్యాప్తు చేసి నిజాలు బట్టబయలు చేసిందన్నారు. ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులకు బాబు స్పందించకుండా తనపై దర్యాప్తు చేసే అధికారం లేదని ఐటీ శాఖకు లేఖలు రాయడం ఏంటని ప్రశ్నించారు. దర్యాప్తునకు సహకరించి అధికారుల ఎదుట హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న బాబు నిజాయతీ కలవాడైతే విచారణకు హాజరై ప్రజలు, దర్యాప్తు సంస్థల ఎదుట నిజం ఒప్పుకోవాలన్నారు. దొంగ నాటకాలాడుతూ ప్రజలు, వ్యవస్థలను మభ్యపెట్టి అవినీతి కేసుల నుంచి తప్పించుకునేందుకు ఆయన ఆడుతున్న దొంగ నాటకాలు బయటపడ్డాయన్నారు. ఐటీ శాఖ ఇచ్చిన నోటీసుల్లో కూడా బోగస్ కంపెనీలు, బోగస్ కాంట్రాక్టులు అని పేర్కొనడం గమనించదగ్గ విషయమని, అడ్డంగా దొరికిపోయిన దొంగ చంద్రబాబు తప్పించుకునే మార్గం లేక పిచ్చిపట్టిన వాడిలా ప్రవర్తిస్తున్నాడన్నారు. బాబు బతుకు బస్టాండ్ అయిందన్న విషయం గుర్తుంచుకోవాలని, ఆయనతో పాటు లోకేష్‌కు కూడా ఈ అవినీతిలో పాత్ర ఉందని తెలిపారు. రోజుకో తప్పు చేస్తూ వాటిని ఎదుటి వారిపై రుద్దడం అలవాటైన బాబు ఇక జైలుకెళ్లడం ఖాయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజా రంజక పాలన చూసి ఓర్వలేక రాష్ట్రంలో తిరుగుతూ బాబు, ఆయన కుమారుడు లోకేష్‌లు ప్రభుత్వంపై బురదజల్లి రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతున్నారని మండిపడ్డారు. బాబు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి చేసిన అవినీతిని కళ్లారా చూసిన ప్రజలు ఆయన కల్లబొల్లి మాటలు, కపట వేషాలు నమ్మరని వివరించారు. ఇకనైనా ఐటీ శాఖ అధికారుల ఎదుట హాజరై నిజం ఒప్పుకుంటే కొంతైనా శిక్ష తగ్గుతుందని కత్తెర సురేష్ కుమార్ సూచించారు.

శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు
ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు, విద్యార్థిని, విద్యార్థులకు
శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేస్తూ...
యాదవ హైస్కూల్ పాతగుంటూరు, గుంటూరు-1
ప్రెసిడెంట్ శ్రీ కూరాకుల గురవయ్య
సెక్రటరీ & కరస్పాండెంట్ శ్రీ మైలా అంజయ్య B.Com మరియు పాలకవర్గం
ప్రధానోపాధ్యాయులు శ్రీమతి కె. రాజ్యలక్ష్మి M.A., B.Ed., ఉపాధ్యాయ మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com